# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రెండు రోజుల పర్యటన నిమిత్తం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ గ్యానేష్ కుమార్ ఈరోజు తిరుపతి చేరుకున్నారు.
- ❖ న్యాయవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ తెలిపారు.
- ❖ భవిష్యత్ అవసరాల దృష్ట్యా విశాఖపట్టణంలో 102 కిలోమీటర్ల మేర సెమీరింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు మంత్రి పి.నారాయణ ప్రకటించారు.
- ❖ రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల 410 కోట్ల రూపాయల విలువైన ధాన్యం సేకరణ పూర్తి చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

======================

సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే న్యాయ వ్యవస్థలో మానవీయ విలువలను కాపాడాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మించిన 10 న్యాయస్థానాల భవన సముదాయాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ.. కరోనా వంటి క్లిష్ట సమయాల్లోనూ సాంకేతికత అండతో సామాన్యులకు సకాలంలో న్యాయం అందించగలిగామని గుర్తు చేశారు. భవిష్యత్‌లో న్యాయవ్యవస్థ పని తీరును మెరుగుపరచడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. న్యాయ వ్యవస్థలో డిజిటలైజేషన్ ప్రక్రియది కీలకపాత్ర అని, న్యాయ వ్యవస్థలో సాంకేతికతను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ఏఐ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

======================

రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోని రామవరప్పాడులో ఉన్న రైతు సేవా కేంద్రం, రైస్ మిల్లులను మంత్రి ఈరోజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు రాష్ట్ర

వ్యాప్తంగా 4 వేల 410 కోట్ల రూపాయల విలువైన ధాన్యం సేకరణ పూర్తి చేసినట్లు వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే 94 శాతం మేర చెల్లింపులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీని వలన రైతులకు పెద్ద ఎత్తున ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్రం నుంచి ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్) సేకరించాలని తాము కోరగా.. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని నాదెండ్ల మనోహర్ పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

======================

రెండు రోజుల పర్యటన నిమిత్తం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ గ్యానేష్ కుమార్ ఈరోజు తిరుపతి చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గ్యానేష్ కుమార్ తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని ఎన్నికల ప్రధాన కమిషనర్ తెలిపారు. రేపు ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు.

======================

ప్రధానమంత్రి ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (PM-DAJGUA) పథకంలో భాగంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో "గిరిజన హోమ్ స్టే" ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ తిరుమాని శ్రీపూజ మండల తహసిల్దార్, మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గిరిజన సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తూనే.. స్థానిక యువతకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలో మూడు క్లస్టర్లు గుర్తించాలని, అందులో చింతపల్లి మండలం లంబసింగి ఒక క్లస్టర్ గా, అరకు, డుంబ్రిగూడ మండలలో రెండు క్లస్టర్లుగా గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, భద్రత, పర్యాటక ఆకర్షణలను పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక జరగాలని సూచించారు. ఈ పథకం అరకు, డుంబ్రిగుడ, అనంతగిరి, చింతపల్లి మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టానున్నారు.

======================

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ ఈరోజు ప్రారంభమైంది. ఒంగోలులోని త్రోవగుంట సమీపంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాము నుంచి మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా పాఠ్య పుస్తకాలను పంపుతున్నారు. జిల్లాలోని విద్యార్థులకు 13 లక్షల పైచిలుకు పుస్తకాలు అవసరం కాగా.. మొదటి విడతలో 11 లక్షల పైచిలుకు పుస్తకాలు వచ్చాయని పాఠ్య పుస్తకాల గోదాము ఇన్ ఛార్జ్ జిందా బాషా తెలిపారు. ఇంకా 2 లక్షల పైచిలుకు పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఈ ఏడాది 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు మారాయని, విద్యార్థులకు కొత్త పుస్తకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెలాఖరు నాటికి అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

విరామం

======================

విశాఖపట్నంలోని కైలాసగిరిపై నిర్మించిన 65 అడుగుల త్రిశూలాన్ని మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ ఈరోజు ప్రారంభించారు. అనంతరం వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ.. భారీ త్రిశూలం, ఢమరుకం ఏర్పాటు చేయడంతో కైలాసగిరికి మరింత శోభ చేకూరిందన్నారు. సుమారు 3 కోట్ల రూపాయల వ్యయంతో ఈ త్రిశూలాన్ని నిర్మించామని, కైలాసగిరిని గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తాయని తెలిపారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీరింగ్ రోడ్డు

నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే, భోగాపురం ఎయిర్ పోర్టుకు 7 కనెక్టింగ్ రోడ్లను VMRDA నిర్మిస్తుందని, ఇప్పటికే 3 రోడ్లు పూర్తయ్యాయని నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

ఆకాశవాణి ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా "స్వర సంధ్య" సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని విజయవాడ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ జనరల్ ఎమ్. సోమేశ్వరరావు తెలిపారు. ఆకాశవాణి కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఆకాశవాణి 90 వసంతాలను పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రేపు సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులు సర్వేపల్లి సిస్టర్స్ యుగళ గానం, పసుపులేటి అయ్యప్ప స్వామి బృందం, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు ప్రొగ్రామ్ విభాగాధిపతి గుడుపూడి దివ్య తెలిపారు. ఆకాశవాణి న్యూస్ విభాగాధిపతి టి. హెన్రీ రాజ్ మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో సమాచార విప్లవం ఎన్ని మలుపులు తిరిగినా.. ఆకాశవాణి తన విశ్వసనీయతను, ప్రామాణికతను కాపాడుకుంటూనే ఉందని పేర్కొన్నారు.

======================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఆగష్టు నెల కోటాను ఈనెల 18న ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న ఆన్ లైన్ లో విడుదల చేస్తున్నట్లు టిటిడి తెలిపింది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను, తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని వెల్లడించింది.

======================

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, దక్షిణ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు.

======================
======================